బోనమెత్తిన.. భక్తిధాం తండా

వైభవంగా శివపార్వతుల కల్యాణం

కల్హేర్(నారాయణఖేడ్): నిజాంపేట మండలం బల్కంచెల్క (భక్తిధాం) తండాలో విశ్వపాళిని భవాని సమేత సేవాలాల్ మహరాజ్ మహా మందిరంలో శనివారం బోనాలు ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. మేడ్చల్ జిల్లా రవాణాశాఖ అధికారి, మందిరం ధర్మకర్త కిషన్‌సింగ్ లలిత దంపతుల ఆధ్వర్యంలో మందిరం వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. అలాగే, కొండాపూర్ ఆశ్రమ పీఠాధిపతి సంగ్రామ్ మహరాజ్, దేవిదాస్ మహరాజ్, మందిరం పురోహితులు మనోజ్‌శర్మ నేతృత్వంలో శివపార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. సామూహిక లలిత సహస్రనామ కుంకుమార్చన, మహా నైవేద్యం, మంగళహారతి, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణ, అన్నదానం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కిషన్‌నాయక్, తండా వాసులు శంకర్, కాట్రోత్ జైల్‌సింగ్, రాములు, కె.కిషన్, రూప్‌సింగ్, సవాయ్‌సింగ్, మన్మోహన్‌సింగ్, జైపాల్, గోవింద్ పాల్గొన్నారు.



బల్కంచెల్క తండాలో బోనాలు ఊరేగిస్తున్న భక్తులు



శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న సంగ్రామ్ మహరాజ్, తదితరులు



కల్హేర్: భవానీమాత సన్నిధిలో సాముహిక సహస్ర కుంకుమార్చన చేస్తున్న భక్తులు

క్లుప్తంగా

కేతకీలో ప్రత్యేక పూజలు



స్వాగతం పలుకుతున్న అర్చకులు

ఝరాసంగం(జహీరాబాద్): దక్షిణకాశీగా ప్రసిద్ధి చెందిన కేతకీ సంగమేశ్వర ఆలయంలో శనివారం జిల్లా అడిషనల్ కలెక్టర్ ఆర్.డి మాధూరి కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. వారికి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. పార్వతీ పరమేశ్వరులకు అభిషేకం, కుంకుమార్చన, మహామంగళహారతి తదితర పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలు అందించి, పూల మాలల, శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, ఆలయాధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

క్రీడాకారిణికి సన్మానం



కాలేశ్వరిని సన్మానిస్తున్న సునీతాలక్ష్మారెడ్డి

హత్నూర(సంగారెడ్డి): మార్షల్ ఆర్ట్స్ ఉష్షులో జాతీయస్థాయి పోటీల్లో విజయం సాధించి తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి గుర్తింపును తీసుకురావాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. హత్నూర మండలంలోని సిరిపురం గ్రామానికి చెందిన కాలేశ్వరి ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి మార్షల్ ఆర్ట్స్ ఉష్షు పోటీల్లో పాల్గొని బంగారు పతకం సాధించి, పంజాబ్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికయింది. దీంతో ఎమ్మెల్యే శనివారం ఆమెను సన్మానించి, జాతీయ స్థాయి పోటీలకు వెళ్లేందుకు ఆర్థికంగా సహకరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సిరిపురం గ్రామ మాజీ సర్పంచ్ మచ్చ నరేందర్, ఉమ్మడి మెదక్ జిల్లా ఉష క్రీడా ప్రధాన కార్యదర్శి, గ్రాండ్ మాస్టర్ పోచయ్య, వీరేశం ఉన్నారు.

షెడ్లను తొలగిస్తాం

ఎఫ్‌ఆర్‌ఓ షాహిన్

హత్నూర(సంగారెడ్డి): హత్నూర మండలం షేర్‌ఖాన్‌పల్లి శివారులోని పలుగు పోచమ్మ ఆలయం సమీపంలో అటవీ భూముల్లో అక్రమంగా వేసిన రేకుల షెడ్లను తొలగించనున్నట్లు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ షాహిన్ తెలిపారు. శనివారం అక్రమంగా ఏర్పాటు చేసిన రేకుల షెడ్లు వేసిన దుకాణాల స్థలాన్ని పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అటవీ భూమిలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని తెలిపారు. రేకుల షెడ్లను తొలగించడానికి త్వరలో చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. ఆమె వెంట బీట్ ఆఫీసర్ ఉన్నారు.

డేటా ఎంట్రీ పరిశీలన

మునిపల్లి(అందోల్): సమగ్ర కుటుంబ సర్వే ఆన్‌లైన్ డేటా ఎంట్రీని ఎంపీడీఓ హరినందన్ రావు శనివారం పరిశీలించారు. ఆయా గ్రామాల నుంచి ఇప్పటివరకు 11.814 కుటుంబాల సర్వే ఎన్యుమరేటర్లు పూర్తి చేసి నట్లు తెలిపారు. 27 కంప్యూటర్లు, 36 లాగిన్ ఏర్పాటు చేసామన్నారు. సర్వే ఫారాలను క్షుణంగా పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కంప్యూటర్ ఆపరేటర్లుకు సూచించారు. 314 సర్వే ఫారాలను ఆన్‌లైన్ చేసినట్లు చెప్పారు.

హైమాస్ట్ లైట్లు ప్రారంభం

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణంలో గాంధీ చౌక్, శ్రీకృష్ణనగర్‌కాలనీ, కబరస్తాన్ ప్రాంతాల్లో నూతనంగా ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను శనివారం మున్సిపల్ వైస్ చైర్మన్ చింతాగోపాల్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు శివరాజ్‌పాటిల్ ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు సతాని శ్రీశైలం, ఇంద్ర మోహన్‌గౌడ్, ఆకుల శివకుమార్, ప్రకాష్, శ్రీనివాస్, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

కొలువుదీరిన ఆలయ పాలకవర్గం

సంగారెడ్డి: సంగారెడ్డి జిల్లా చౌటకూర్ మండలం చక్రియాల గ్రామంలో వెలసిన లక్ష్మీఅనంత పద్మనాభస్వామి ఆలయ కమిటీ కొత్త పాలకవర్గం శనివారం కొలువుదీరింది. ఆలయ కమిటీ డైరెక్టర్లుగా నియమితులైన భానూరి లక్ష్మయ్య, మన్నె నర్సింలు, జంగిలి మల్లమ్మ, తిమ్మారెడ్డిగారి అంజిరెడ్డి, రోళ్లపాటి సత్యనారాయణ, ఎక్స్ అఫిషియో మెంబర్ ఆలయ అర్చకులు మహారాజుల రామకృష్ణ శర్మలచే దేవాదాయ శాఖ ఇన్స్‌స్పెక్టర్ రంగారావు ఆలయ మంటపంలో పదవీ ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం డైరెక్టర్లందరూ భానూరి లక్ష్మయ్యను ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన పాలకవర్గాన్ని గ్రామ కాంగ్రెస్ నాయకులు, స్థానికులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఆలయాన్ని మరింత అభి వృద్ధి చేసేందుకు కషి చేస్తానని కమిటీ చైర్మన్ లక్ష్మయ్య తెలిపారు. నూతన పాలకవర్గం ఏర్పాటుకు సహకరించిన మంత్రి దామోదర రాజనరసింహకు , కాంగ్రెస్ నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దశరథ్ పాల్గొన్నారు.

ప్రత్యేక ఓటరు నమోదు పరిశీలన

కంది(సంగారెడ్డి): ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమాన్ని తహసీల్దార్ విజయలక్ష్మి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 18 ఏళ్లు నిండిన యువతి, యువకులందరూ ఓటర్‌గా నమోదు చేసుకునేందుకు మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రత్యేక ఓటర్ నమోదు క్యాంపులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ నెల 24 వరకు స్పెషల్ క్యాంపెనింగ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ క్యాంప్లో కొత్త ఓటర్ నమోదు, చనిపోయిన వారి పేర్లను తొలగించడం తప్పులను సరిదిద్దనున్నట్లు తెలిపారు. ఫాం 6,7,8లను అందుబాటులో ఉంచాలని బీఎల్ఓలకు సూచించారు.మండలంలో 48 పోలింగ్ కేంద్రాల పరిధిలో 28 క్యాంపులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మల్లేశం, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రంగయ్యతో పాటు బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి

టీఎన్జీఓ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతకాయల మహేశ్

హత్నూర(సంగారెడ్డి): గ్రామపంచాయతీ కార్యదర్శి రమేష్‌ను ఇన్ఫార్మర్ నేపంతో మావోయిస్టులు హత్య చేశారు. ఆ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని టీఎన్జీఓ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతకాయల మహేశ్ డిమాండ్ చేశారు. శనివారం హత్నూరలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రమేష్‌ను మావోయిస్టులు హత్య చేయడం తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం కోటి రూపాయలు, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తున్న గ్రామపంచాయతీ కార్యదర్శులకు రక్షణ లేకుంటే అభివృద్ధి కుంటుపడుతుందన్నారు. సమస్యాత్మక గ్రామాల్లో గ్రామపంచాయతీల వద్ద పోలీసులు రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. విలేకరుల సమావేశంలో గ్రామపంచాయతీ కార్యదర్శులు నవీన్, నీరజ, శ్వేత పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న మహేశ్‌కుమార్

గుమ్మడిదలలో ట్రైనీ కలెక్టర్ పర్యటన

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మండలం అన్నారం గ్రామంలో ట్రైనీ కలెక్టర్ ఆకాంక్ష మిలింద్ పర్యటించారు. ఈ సందర్భంగా మండల అభివృద్ధి అధికారి ఉమాదేవి ట్రైనీ కలెక్టర్‌కు ఘన స్వాగతం పలికారు. అనంతరం అన్నారం గ్రామంలో పర్యటించి పలు అంశాలను పరిశీలించారు. గ్రామపంచాయతీలో స్థానిక అంశాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల జీవన స్థితిగతుల పై ఐదు రోజుల పాటు స్థానికంగా ఉండి అధ్యయనం చేయనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ట్రైనీ అధికారుల బృందానికి స్థానిక అధికారులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో అన్నారం ఈఓ సంగీత పాల్గొన్నారు.



ట్రైనీ అధికారులకు స్వాగతం పలికిన ఎంపీడీ

కేసులు త్వరగా పరిష్కరించాలి

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రమేష్



సెంట్రల్ జైలును సందర్శించిన రమేష్

సంగారెడ్డి టౌన్: ఖైదీల కేసులను త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి రమేష్ అన్నారు. శనివారం కందిలోని సెంట్రల్ జైలును సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఖైదీలకు సదుపాయాలు కల్పిస్తూ ములాఖత్ అందించాలన్నారు. ఇబ్బందులు లేకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. అనంతరం వంటశాల, లీగల్ ఎయిడ్ క్లినిక్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ ద్వారా ఉచిత సేవలు పొందవచ్చని ఖైదీలకు తెలియజేశారు. కార్యక్రమంలో జైలు సిబ్బంది, న్యాయవాదులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

ఎమ్మెల్యే చింత ప్రభాకర్

సంగారెడ్డి రూరల్: పేదలకు అండగా సీఎం సహాయనిధి ఉపయోగపడుతోందని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కొండాపూర్ మండలం, సంగారెడ్డి పట్టణ, సంగారెడ్డి మండలానికి చెందిన 53 మంది లబ్ధిదారులకు రూ 17.68లక్షల విలువ గల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం లబ్ధిదారులు ఎమ్మెల్యే ప్రభాకర్‌కు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బుచ్చిరెడ్డి, జైపాల్‌రెడ్డి, విజేందర్ రెడ్డి, విఠల్, పాండు పాల్గొన్నారు.

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే మాణిక్‌రావు లబ్ధిదారులకు శనివారం సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. మండలంలోని తుంకుంటకు చెందిన ప్రేమకు రూ. 60 వేలు, బుర్దిపాడ్ చెందిన అశోక్‌కు రూ. 18 వేలు, కాశీంపూర్ సువర్ణకు రూ. 25 వేలు, దిడిగి గ్రామానికి చెందిన రాజరత్నంకు రూ.25 వేలు, హోతి(బి)కి చెందిన పద్మమ్మాకు రూ. 60 వేలు, సత్వార్ అస్మాబేగంకు రూ. 13 వేలు, మహ్మద్‌అలీకి రూ. 23 వేలు, అనేగుంటకు చెందిన ఎర్రగొల్ల తుల్జమ్మకు రూ. 39 వేలు, మానెమ్మకు రూ.13 వేల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు తట్టు నారాయణ, నాయకులు అమిత్‌కుమార్, విజయ్‌రాథోడ్ పాల్గొన్నారు.



జహీరాబాద్ టౌన్: చెక్కుల పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

గంజాయి కేసులో ఐదేళ్ల జైలు, జరిమానా



నిందితుడిని చూపుతున్న పోలీసులు

మునిపల్లి(అందోల్): వ్యవసాయ భూమిలో గంజాయి సాగు చేసిన వ్యక్తికి సంగారెడ్డి ఫస్ట్ అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీమతి జయంతి జైలు శిక్షతో పాటు జరిమానా విధించారు. మునిపల్లి మండలంలోని పెద్దలోడి (లోనికలాన్) గ్రామానికి చెందిన మంగలి వెంకటేశం గంజాయి సాగు చేశాడు. 2018 నవంబర్ 6వ తేదీన ఎక్సైజ్ సీఐ మధుబాబు సిబ్బందితో దాడి చేసి 36 మొక్కలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి కేసు కొనసాగుతుండగా నిందితుడిని శనివారం కోర్టులో హాజరుపర్చారు. జడ్జి ఐదేళ్ల జైలు శిక్షతోపాటు రూ.25 వేలు జరిమానా విధించారు.

వేతనాలు చెల్లిస్తేనే విధుల్లో చేరుతాం..

న్యాల్‌కల్(జహీరాబాద్): మండలంలోని చాల్కి సమీపంలోని మిషన్ భగీరథ ఫిల్టర్ బెడ్‌ను శనివారం ఎస్‌ఈ రఘువీర్ ఈఈ విజయలక్ష్మి సందర్శించారు. భగీరథ పథకంలో పని చేస్తున్న కార్మికులు తమకు వేతనాలు ఇవ్వకపోవడంతో ఆందోళనకు దిగిన విషయం తెలిసిందే. దీంతో ఝరాసంగం, న్యాల్‌కల్ మండలాల్లోని 75 గ్రామాలకు నీటి సరఫరా నిలిచిపోయింది. దిగి వచ్చిన అధికారులు కార్మికులతో చర్చలు జరిపారు. మూడు రోజుల్లో వేతనాలను చెల్లిస్తామని విధుల్లో చేరి నీటి సరఫరాను పునరుద్ధరించాలని కార్మికులను కోరారు. తమకు వచ్చే మొత్తం వేతనాలు చెల్లించడంతో పాటు ప్రభుత్వపరంగా రావాల్సిన బెనిఫిట్స్ మంజూరు చేస్తేనే నీటి సరఫరా చేస్తామని తెగేసి చెప్పారు. దీంతో అధికారులు తిరిగి వెళ్లిపోయారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

జిన్నారం (పటాన్‌చెరు): జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్‌లో గుమ్మడిదల, బొల్లారం విద్యార్థులు ప్రతిభ చాటారు. శనివారం జిల్లాలో సైన్స్ మ్యూజియంలో జరిగిన సైన్స్ ఎగ్జిబిషన్ పోటీల్లో గుమ్మడిదల, బొల్లారం విద్యార్థులు తేజస్విని, గౌతమ్ తయారు చేసిన నమూనాలు సత్తా చాటి ప్రథమ బహుమతులతో పాటు ప్రశంసా పత్రాలు సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థులను అభినందిస్తూ సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు బహుమతులు ప్రదానం చేశారు. సైన్స్ ఫెయిర్‌లో సత్తా చాటిన విద్యార్థులను గైడ్ టీచర్‌ను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

కస్తూర్బా పాఠశాల తనిఖీ

పుల్‌కల్(అందోల్): పుల్‌కల్ కస్తూర్బా పాఠశాలను మండల విద్యాధికారి శంకర్ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంటగది, స్టాక్ రూం, తరగతి గదులను పరిశీలించారు. స్టాక్ రూంలో బియ్యాన్ని, వంట వస్తువులను పరిశీలించారు. విద్యార్థులతో పాఠ్య పుస్తకాలను చదివించారు. అనంతరం సిబ్బందికి తగు సూచనలు చేశారు.

నాణ్యత తప్పనిసరి

కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్

పటాన్‌చెరు టౌన్: సీసీ రోడ్డు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ అన్నారు. శనివారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని పాత మార్కెట్, పోలీస్‌స్టేషన్ నుంచి గౌతంనగర్ వరకు రూ.2 కోట్లతో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. రోడ్డు నిర్మాణం మధ్యలో జంక్షన్‌ల వద్ద నీటి పైపులు లీకేజీ ఏర్పడితే వెంటనే మరమ్మతులు నిర్వహించాలని సూచించారు. అనంతరం పటాన్‌చెరులోని బండ్లగూడ, నేతాజీనగర్, బాలాజీనగర్‌లో స్థానిక కాలనీవాసులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

నల్లవాగు రైతులపై వివక్ష తగదు

మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న భూపాల్‌రెడ్డి

కల్హేర్(నారాయణఖేడ్): జిల్లాలోని మధ్యతరహా ప్రాజెక్టు నల్లవాగు ఆయకట్టు రైతులపై వివక్షత తగదని ఖేడ్ మాజీ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి ఆరోపించారు. శనివారం మండలంలోని ఖానాపూర్(కె)లో విలేకరులతో మాట్లాడారు. ప్రాజెక్టులో పూర్తి ఆయకట్టుకు సరిపోయేంత నీరు ఉందన్నారు. యాసంగి పంటల సాగుకు 4 వేల ఎకరాలకు మాత్రమే నీరు విడుదల చేస్తామని పాలకులు చెబుతున్నారని, మిగిలిన రైతులకు అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ ఆత్మ చైర్మన్ రాంసింగ్, మాజీ జెడ్పీటీసీ నర్సింహరెడ్డి, మాజీ కోఆప్షన్ సభ్యులు అలీ, ఎం.ఎ.ఘని, నాయకులు సాయిగొండ, రాములు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలను కూల్చిస్తాం

డీఎల్‌పీఓ అనిత

పటాన్‌చెరు టౌన్: అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకుంటామని, నోటీసులు ఇచ్చిన వినకుండా నిర్మాణాల చేపడితే కూల్చిస్తామని డీఎల్‌పీఓ అనిత హెచ్చరించారు. శనివారం పటాన్‌చెరు మండలంలోని ఇంద్రేశం గ్రామ పంచాయతీని ఆకస్మికంగా సందర్శించారు. అనంతరం మండల పంచాయతీ అధికారి హరిశంకర్‌గౌడ్, కార్యదర్శి సుభాష్‌లతో కలిసి గ్రామంలో పర్యటించి, నిర్మాణాలను పరిశీలించారు. అక్రమ నిర్మాణాన్ని అన్నింటినీ కూల్చివేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న డీఎల్‌పీఓ అనిత

ప్రయాణికులకు మెరుగైన సేవలు

ఆర్టీసీ డీఎం మల్లేశయ్య



సమావేశంలో మాట్లాడుతున్న డీఎం మల్లేశయ్య

నారాయణఖేడ్: ఆర్టీసీ అధికారులు, సిబ్బంది ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడానికి కృషి చేయాలని ఖేడ్ ఆర్టీసీ డీఎం మల్లేశయ్య పేర్కొన్నారు. శనివారం డిపోలో డిపో స్థాయి సంక్షేమ బోర్డు సమావేశం నిర్వహించారు. బోర్డులో నూతనంగా డ్రైవర్ బీరయ్య, కండక్టర్ సంగీతను ఎన్నుకొని శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. అధికారులు, కార్మికుల సంక్షేమానికి కృషి చేయాలని వారిని కోరారు. అసిస్టెంట్ మేనేజర్ నర్సింహులు, మెకానికల్ మేనేజర్ దశరథరావు, ఆఫీస్ సూపరింటెండెంట్ ప్రవీణ్‌కుమార్, అకౌంట్స్ సూపరింటెండెంట్ నర్సప్ప, కిషన్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **హామీలు అమలు కాకుండానే ప్రదర్శనలా?**

పుల్‌కల్(అందోల్): ప్రజాపాలన ప్రజా విజయోత్సవ ప్రచార ప్రదర్శన రథాన్ని శనివారం పుల్‌కల్ ప్రజలు అడ్డుకున్నారు. అమలు కాని ఆరు గ్యారెంటీలపై సాంస్కృతిక కళాకారులు పాటలు పాడటంపై ప్రజలు ఆక్షేపించారు. అమలు కాకుండానే అమలైనట్లు పాటలు పాడి ప్రజలను మభ్యపెడుతారా అని నిలదీశారు. మండల కేంద్రం పుల్‌కల్‌లో శనివారం సంత కావడంతో ప్రజాపాలన విజయోత్సవ రథాన్ని సంతలో ఆపి కళాకారులు ఆరుగ్యారెంటీల అమలుపై పాటలు పాడుతూ.. అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తున్నారు. దీంతో అక్కడున్న ప్రజలు రెండు లక్షల రుణమాఫీ, కల్యాణలక్ష్మి, తులం బంగారం, వడ్లకు రూ. 500 బోనస్, మహిళలకు రూ. 2500 ఇస్తున్నారా అని ప్రశ్నించారు. దీంతో కళాకారులు వెనుదిరిగారు.

◆ **మహిళలకు ఉచిత క్యాన్సర్ పరీక్షలు**

జహీరాబాద్ టౌన్: వికాస తరంగిణి ఆధ్వర్యంలో పట్టణంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో మహిళలకు ఉచితంగా క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేశారు. వైద్య శిబిరాన్ని వికాస తరంగిణి అధ్యక్షుడు అల్లాడి విరేశం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్రీతిండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి వారి ఆశీస్సులతో రాష్ట్రవ్యాప్తంగా వైద్య శిబిరాలు నిర్వహించి మహిళలకు క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నామని చెప్పారు. వైద్య శిబిరంలో 127 మంది మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించామన్నారు. గర్భకోశంలో ఇన్ఫెక్షన్ ఉన్నవారికి ఉచితంగా మందులు అందజేశామని తెలిపారు.

◆ **పోలీస్‌స్టేషన్ సందర్శన**



రాయికోడ్(అందోల్): రాయికోడ్ పోలీస్ స్టేషన్‌ను జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి శనివారం సందర్శించారు. ఈ ఏడాది స్టేషన్‌లో నమోదైన కేసుల దర్యాప్తులో పురోగతిని తెలుసుకున్నారు. ఆయా రికార్డులను పరిశీలించారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కేసుల నమోదు అనంతరం మెరుగైన దర్యాప్తు చేయాలని సూచించారు. కార్యక్రమంలో జహీరాబాద్ రూరల్ సీఐ జక్కుల హన్మంతు, ఎస్ఐ నారాయణ, పోలీసు సిబ్బంది ఉన్నారు.

◆ **ఘనంగా కార్తీక దీపోత్సవం**



ఝరాసంగం(జహీరాబాద్): కార్తీక మాసాన్ని పురస్కరించుకుని పాఠశాలలో కార్తిక దీపోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. శనివారం మండల పరిధిలోని కుప్పానగర్ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలోఉపాధ్యాయులు, విద్యార్థులు పూజలు చేసి, దీపాలను వెలిగించారు.